

సి.హెచ్. శాంతాదేవి

"...నాకీ జీవితాన్ని ప్రసాదించింది ఒక అనామకుడూ వికృష్టుడూ కాదు. సంఘంలో పేరుమోసిన పెద్ద మనిషీ, బ్రతకనేర్చినవాడూ. ఇంకా చెప్పాలంటే పదిమందిలో శభాష్ అని పించుకున్న గొప్ప వ్యక్తి...

"కానీ, నా జీవితాన్ని చిందరవందర చేసిన ఘనతకూడా అతనికే దక్కింది."

ఆఖరుపేజీ తిరిగేశాడు మధు. అక్కడక్కడా పేజీలు చిరిగి వున్నాయి. చివరి చివరికి అక్షరాలు అల్లుకుపోయి మానవ జీవితం కూడా చివరి దశలో ఇంతే సుమా అనిపించేట్టు శిథిలావస్థలో వున్నాయి.

"అన్ని జీవరాసుల్లోకీ మానవ జీవితం వున్నతమైంది అంటారే, ఒక్కో వ్యక్తి జీవితం మొదట్నించీ చివర వరకూ ఎందుకూ పనికిరాకుండా ఎవరికీ వుపయోగం లేకుండా ఎందుకు నిరర్థకమైపోతుందీ!

"అడవిలో గడ్డిపువ్వుకైనా విలువుంటుందేమోగానీ నా బ్రతుక్కి ఒక అర్థం అనేది లేకుండా పోయింది."

మధు డైరీ మూసేశాడు గుండెలు బరువెక్కగా...

"మధూ, మన జీవితాలు ఇలాగే, ఇంత ఆనందంగానూ గడిచిపోవాలంటే మనిద్దరికీ వుండవలసింది ఏమిటీ?"

పండువెన్నెల్లో ఒడిలో తలపెట్టుకుని పడుకున్న అపర్ణ ప్రశ్నించింది.

అతను అర్థంగానట్టు చూశాడు.

చివాల్న లేచి కూచుంది.

"తెలీదూ?" కఠినంగా ప్రశ్నించింది.

అంతవరకూ ఆమె గొంతులో ఏవి పించిన ప్రేమా, అభిమానం మాయమై వాటి స్థానంలో కోపం తొంగిచూస్తాడింది

మధు తల అడ్డంగా వూపాడు.

"నీలో వుండాల్సింది ధైర్యం, నా క్కావల్సింది చొరవా, అవునా?"

"అవును."

"నీ క్కావలిసిన జీవితాన్ని నువ్వే ఏర్పరచుకో. కానీ అందులో ఓ పక్కగా నాకూ కూడా చోటు వుంచు..." అతని చేతులు అందుకుని మొహానికి అనించు కుంది.

అతని చేతికి కన్నీళ్ళు వెచ్చగా తగిలాయి.

"అపర్ణా, నా పరిస్థితి నీకు తెలుసు. ఆర్థిక ఇబ్బందులూ, అంతకుమించిన బాధ్యతలు కూడా నా చుట్టూ వున్నాయి. నా మురికి జీవితంలోకి నిన్నూ లాగి నీకూ బురద అంటించమంటావా? కొద్ది రోజులు ఓపిక పడితే నా ఇబ్బందులన్నీ దాటి నిన్ను చేరుకుంటాను. నన్ను నమ్ముతావా అపర్ణా?"

"నీమీద నమ్మకం వుంది. ఎన్నాళ్ళయినా నీకోసం ఆగుతాను-" అతను ఇచ్చిన వాగ్దానాలన్నీ ఏమైనాయి?

"నువ్వు తప్ప నా జీవితంలో ఎవరూ లేరు" అన్నాడు. ఆ మాట ఎంతవరకూ నిజం చేశాడు!

కలలు కనటమే అపర్ణ వంతు అయింది.

ఆమె నెత్తిన పిడుగు పడిన ఆ రోజు ఎప్పుడు?

ఆ క్షణం ఏది?

అతను కళ్ళబడగానే అడుగుదామను కున్న ప్రశ్నలు నాలిక చివరే ఆగి పోయాయి.

మధు నిర్వికారంగా వున్నాడు.

తన వుత్తరానికి అపర్ణ వద్దనుండి లభించబోయే తిరస్కారం ఎంత తీవ్రంగా వుంటుందో అతనికి తెలుసు.

కానీ అందుకు భిన్నంగా యీ కొత్త అపర్ణ అతనిలో భయాన్ని రేకెత్తిస్తోంది. ఆమె మౌనం అతన్ని బాధిస్తోంది.

ఆమెని ఒంటరిగా కలిసినప్పుడు అతను ఆగలేకపోయాడు.

"ఏదైనా మాట్లాడు అపర్ణా. నన్ను తిట్టు, ద్వేషించు. అంతేగానీ మాట్లాడకుండా నీ ముభావంతో నాకు నరకం చూపించకు..."

అతను దీనంగా అంటున్న ఆ మాటలు ఆమెలో చలనాన్ని కలిగించలేకపోయాయి.

కానీ,

అతను ఏమన్నాడూ?

"ఆమె కిచ్చిన మాట తప్పలేక పోయాను అపర్ణా. నన్నే నమ్ముకుంది. ఆమె పరిస్థితి ఎంత హీనంగా, నికృష్టంగా ఉందో చూస్తే నీకే తెలుస్తుంది."

ఆమె హృదయంలో మంటలు లేచాయి. తన్ను తాను అదుపులో

పెట్టుకోలేని నిస్సహాయతతో వెక్కి వెక్కి ఏడిచింది.

"నా కిచ్చిన వాగ్దానాలు ఏ గంగలో కలిపావు? ఆ అమ్మాయిని గురించి అంత జాలిపడేవాడివి నా కెందుకు ఇన్ని ఆశలు కలిగించావు?"

ఈ మాటలు ఆమె పైకి అనలేదు.

"ఏం మాట్లాడవు అపర్ణా? నేను చేసిన పని తప్పంటావా?"

"తప్పే! ముమ్మాటికీ తప్పే. నా జీవితాన్ని నాశనం చేశావు. నా బ్రతుకుతో ఆట లాడుకున్నావు. నన్ను నమ్మించి ద్రోహం చేశావు. నే నెవరి కోసం బ్రతకాలి?" తల గోడకేసి కొట్టుకుంది...

సరిగ్గా వారంరోజుల క్రితం మధు ఉత్తరం రాశాడు.

"...నువ్వు నాకు ఇంత దగ్గర మనిషివి కావటం కుమార్ అదృష్టం. కుమార్ నిన్ను గురించి చెప్పగానే మొదట్లో నమ్మలేకపోయాను. నాకు ముందే తెలుసు, గొప్ప భవిష్యత్తు నీ కోసం ఎదురుచూస్తోందని. నన్ను మిస్ అయిపోవటం నీ మంచికే జరిగింది."

రాస్తున్న కాగితాలు మడిచి పక్కన పెట్టింది.

మరిచిపోదా మనుకుంటున్న మధు జ్ఞాపకాలు మళ్ళీ...

తలుపువంకే చూస్తోంది. రెండు మూడు క్షణాల్లో తలుపులు తెరుచుకుని మధుమూర్తి ప్రత్యక్షమవుతాడు. అతన్ని ముఖాముఖీ కలుసుకోవటానికి తగినంత శక్తిని కూడదీసుకుంటోంది మనసు.

ఆమె ఎదురుచూస్తున్న మధు లోపలకు వచ్చాడు.

చిరునవ్వుతో కుర్చీ చూపింది కూర్చోమన్నట్టు.

మధు ఆమెవంక తదేకంగా చూశాడు.

"చాలా మారావు అపర్ణా...నువ్వు నువ్వేనని చెప్తే తప్ప పోల్చుకోలేనేమో!"

"............"

"నా వుత్తరం అందిందా? నిన్ను ఇంత వున్నతస్థితిలో చూడటం చాలా ఆనందంగా వుంది. ఏమిటి విశేషాలు?"

"ఏమున్నాయి? నాన్నగారు పోయాక అమ్మా, నేనూ అన్నయ్య దగ్గరకు వెళ్ళాం. నా చదువు అక్కడే పూర్తయింది."

"అవును. శలవుపెట్టి వచ్చేసరికే మీ అన్నయ్యకి ట్రాన్స్‌ఫర్ అయిందని తెలిసింది..."

"తర్వాత చాలా ఊళ్ళు తిరిగాము, అన్నయ్య ఉద్యోగరీత్యా." ప్యూన్‌ని పిలిచి కాఫీకి పంపింది,

"అన్నట్టు పెళ్ళి చేసుకున్నావా?" తలవంచుకుని అడిగింది.

"ఆఁ....సుజాతని. మావాళ్ళెవరికీ ఇష్టంలేదు. అయినా ఆ అమ్మాయితో

సుఖపడగలమ అనే నమ్మకంతో చేసు కున్నాను."

అపర్ణ మాట్లాడలేదు.

అతని మాటలు ఆమెలో ఎంత భారాన్ని నింపుతున్నాయో అతనికి తెలీదు.

"మనం ఏదో అనుకుంటాం అపర్ణా. నిజం చెప్పాలంటే మనక్కావల్సిం దేమిటో మనకే తెలీదు. సుజాతలో నా క్కావల్సింది దొండలేక పోతున్నానేమో నన్పిస్తోంది. ఆమె పట్ల ఇన్నాళ్ళ నించి వున్నది వుత్త ఆకర్షణేనా, మరేమీ లేదా అన్పిస్తోంది. ఒక్కోసారి చాలా భయంగా వుంటుంది. మా ఇద్దరి మధ్యా వున్న ఈ బంధం ఎంతకాలం నిలుస్తుందా అని..." ఆగాడు.

అపర్ణ ఇబ్బందిగా కదిలింది.

వుండుండి డోర్‌వేపు చూస్తోంది.

"ఏవిటీ? ఎవరైనా వస్తారా? పోన్లే సాయంత్రం ఆఫీసు వదిలే టైముకి వస్తాను. అలా బయటకు వెడదాం, వస్తావా?"

"అలాగే! ఇప్పుడు కొద్దిగా పనుంది. మరేమీ అనుకోకు."

"దానికేం, సాయంత్రందాకా వెయిట్ చేస్తాను."

మధు బయటకు నడిచాడు.

ఫోన్ మోగుతుంటే రిసీవర్ తీసింది అపర్ణ.

అవతలి వ్యక్తి ఆఫీసు విషయా లేవో మాట్లాడుతుంటే విరాసక్తంగా వింటోంది.

సాయంత్రందాకా ముళ్ళమీదున్నట్టే గడిపింది.

గతాన్ని తుడిచివెయ్య గలిగాననుకుంది గానీ, అది తనను తాను మభ్య పెట్టుకోవటమేనని ఈనాడు తెలుస్తోంది.

సరిగా గేటువద్ద మధు వెయిట్ చేస్తున్నాడు. అపర్ణని చూసి నెమ్మదిగా నడవసాగాడు.

"జరిగినవన్నీ గుర్తుచేసి నిన్ను బాధ పెడుతున్నానని అనుకోకు. అట్లాంటి రోజుల్ని అనుభవించిన నాకు ఇప్పటి జీవితం నిస్సారంగా, పేలవంగా కనిపి స్తోంది."

"............"

"నీ సానుభూతి, నీ ఓదార్పు నాకు కావాలి అపర్ణా..."


'అవును. వాటి అవసరం వున్న ప్పుడే నా దగ్గరకు వస్తున్నావు.' అను కుంది.

పార్కులో ఓ మూలగా కూర్చున్నారు

"నా సంగతికేంగానీ, నిన్ను గురించి చెప్పు. పిల్లలెంతమంది? మీ వారేం చేస్తారు?"

అతని ప్రశ్న వినిపించుకోనట్టే, "కుమార్ మూడ్నెంతులు ఇంటర్వ్యూలో సెలక్టయినట్టే! అతన్ని గురించి విశ్రాంతిగా వుండు."

"నాకు తెలుసు అపర్ణా, నీకు నామీద



వున్న అభిమానం వెలకట్టలేనిది..."

"ఇంకా వుంటావా నాల్గురోజులు..."

"వుంటాను. సుజాత వాళ్ళ అమ్మగారింటికి వెళ్ళింది. ఇప్పట్లో వస్తుందని నమ్మకంలేదు. తనకీ నాకూ కలవదని తేలిపోయింది..."

"సరే, మళ్ళీ కలుద్దాము. ఫ్రెండుకి వస్తానని మాటిచ్చాను." అపర్ణ లేచి నిలబడింది.

"అప్పుడే వెళ్ళిపోతావా? నీతో చాలా మాట్లాడాలనుకున్నాను. నీ రూపంలోనే గాదు, నీ స్వభావంలో కూడా చాలా మార్పొచ్చింది." అతనూ ఆమెతోపాటు నడుస్తూ అన్నాడు.

"అయితే అయ్యుండవచ్చు. మనుషులెల్లకాలం ఒక్కలాగే వుండరుగా మధూ..."

అతను గబుక్కున ఆమెవేపు తిరిగాడు.

"మధు...ఎన్నాళ్ళయింది నీ నోటి నుండి ఆ పిలుపు విని. మళ్ళీ ఒక్కసారి అను అపర్ణా. అందరూ మర్యాదగా, గౌరవంగా పిలుస్తుంటే వినివినీ విసుగెత్తింది. ఇంత ఆప్యాయంగా

పిలిచేవాళ్ళే కరువయ్యారు. ఇన్నాళ్ళకి నీ నోటినుండి వింటున్నాను ఆ పేరు."

అపర్ణ మాట్లాడలేదు.

ఇలాంటి భావోద్వేగాలకి ఏనాడో అతీతురాలైంది ఆమె.

"కొంచెం సంబాళించుకో మధూ! ఇప్పుడో, మరుక్షణమో అన్నట్టు పెరిగి పోతోంది మన వయసు. గడిచిపోయింది తల్చుకుని బాధపడేకన్నా మనకు లభించిందాట్లో ఆనందం వెతుక్కోవటం మంచిదని నా వుద్దేశం..."

ఆ విషయంలో తనెంత వరకూ కృతకృత్యురాలైంది అన్న ప్రశ్న మెదిలింది మనసులో.

"నే నట్లా అనుకోవటంలేదు అపర్ణా. నీపట్ల అన్యాయం చేశానేమోనన్న బాధ నన్ను తొలిచివేస్తోంది."

అతని మాటల్లో నిజాయితీ వున్నట్టు తోచింది ఆమెకు. అతనిపట్ల సానుభూతితో ఆర్ద్రమైంది ఆమె అంతరంగం.

"జరిగిపోయిందేదీ మన చేతుల్లో లేదు. విచారించకు మధూ..." అంది హృదయపూర్వకంగానే.

మధు కళ్ళు సంతోషంతో మెరిశాయి.

"అయితే నన్ను క్షమించినట్టేనా అపర్ణా..." ఆతృతగా అడిగాడు.

అపర్ణ జవాబు చెప్పలేదు.

ఒక నెలరోజులు ఆమె జీవితాన్ని ఆనందడోలికల్లో వూగించాడు మధు. అపర్ణ చేజారిపోయిందనుకున్న ఆనందం తిరిగి దక్కిందన్న సంతోషంతో ఆమె మనసు మూగబోయింది.

* * *

ఒకప్పుడు ప్రాణంకన్నా అధికంగా ప్రేమించింది మధుని.

మధు ఒంటరివాడు, ప్రేమలో వైఫల్యం పొందినవాడు. దారితప్పిన పసిపిల్లవాడిలా దిక్కుతోచక అయోమయ స్థితిలో వున్నప్పుడు అపర్ణ తన చెయ్యి అందించింది. అపురూపంగా ఆమె చెయ్యందుకున్నాడు. ఆ చేతిని ఎన్నడూ విడవకూడదనుకున్నాడు.

కానీ జరిగిందేమిటి ?

అనుకోకుండా అతని జీవితంలోకి సుడిగాలిలా ప్రవేశించింది సుజాత.

శూన్యంగా వున్న అతని హృదయంలో ప్రశాంతత నింపిన అపర్ణ నిస్సహాయంగా వుండిపోయింది.

"నీకు నేనేమీ కానా మధూ..." దీనంగా అడిగిన ఆమె ప్రశ్నకి "ఎందుకు కాదు? నువ్వు ఎప్పటికీ నాకు స్నేహితురాలివే!"

విరక్తిగా నవ్వింది.

'నీ నుండి నే నాశించేది స్నేహం కాదు మధూ!' అనుకుంది.

మధు దారుణంగా విధించిన శిక్షని మౌనంగా భరించింది. అతను ఏర్పరచిన శూన్యాన్ని ఎలా పూడ్చుకోవాలో తెలియక తికమక పడింది. మధు ఆమె దారిన ఆమెని నిర్దాక్షిణ్యంగా వదిలేసి



యువ

వరికొత్త ప్రపంచాన్ని తన కళ్ళ ఎదుట నిల్చిన సుజాతతో రెక్కలు గట్టుకు ఎగిరిపోయాడు.

అపర్ణ మిగిలిపోయింది ఒంటరిగా,

ఆ నాటి మధు తిరిగి ఈనాడు ప్రత్యక్షమయ్యాడు.

అపర్ణలో కొత్త ఆశలు చింపాడు. ఈ అమరాగం ఎంతవరకు శాశ్వతం అన్న ప్రశ్న ఆమెలో కలగలేదు. మధుని గాఢంగా విశ్వసించింది. కుమార్‌కి వుద్యోగం ఇప్పించటంద్వారా అతనిమీద తనకున్న గౌరవాన్ని వ్యక్త పరుచుకుంది.

"నీదెంత మంచి మనస్సు అపర్ణా..." అన్నాడతను ఆపేక్షగా చూస్తూ.

ఆమె పెళ్ళి చేసుకోలేదని తెలిసి ఎంతో గర్వపడ్డాడు. తనకోసం ఆరాటపడే ఒక వ్యక్తి ఉన్నదనే భావన మనిషికి ఎంతో స్వాంతన లభింపచేస్తుంది.

"ఇంత త్యాగానికి నేను తగనేమో అపర్ణా..." అన్నాడు ఆమె చేతులు కళ్ళ కానించుకుంటూ.

కానీ,

అపర్ణ రెండోసారి ఓడిపోయింది జీవితంలో.

సుజాత తిరిగి వచ్చింది.

ఆమె రాక అపర్ణలో తీరని దుఃఖాన్ని పెంచితే మధులో సంతోషాన్ని కలిగించింది.

"ఆమె ప్రవర్తన ఎటువంటిదైనా ఆమెను స్వీకరించటం నా బాధ్యత అపర్ణా...కారణం, ఆమె నా భార్య."

భార్య!

తాళి కట్టినందుకు ఆమె భార్య...

ఆ తాళి తనకు లేనందువల్ల తమ యిద్దరి అనుబంధం అర్థంలేనిది.

ప్రాణంలేని ఒక తాడుకున్న విలువ మనిషి మనసుకు లేదు.

నన్నెందుకిలా వంచిస్తున్నావు మధూ! నీ కళ్ళకి నేనొక ఆటబొమ్మలా కనిపించాను. ఒంటరితనంలో తోడు కోసం నన్ను దగ్గరకు తీశావు. ఈనాడు నీకు నా అవసరం తీరిపోయింది... మధూ, నాలో ఆశ చావలేదు. ఎంతకాలమైనా నీకోసం నిరీక్షిస్తాను. ఈ లోకంలో మాత్రం కాదు..."

మర్నాడు వుదయం మధు వచ్చేసరికి నిద్రపోతున్న అపర్ణ మంచం పక్కనే టేబిల్‌మీద ఖాళీ నిద్రమాత్రల సీసా కనిపించింది.

